అధ్వానంగా సాగర్ కాల్వలు

- కంపచెట్లతో మూసుకుపోయిన జాన్‌పహాడ్ మేజర్ డిస్ట్రిబ్యూటరీ
- కొన్ని చోట్ల ఆక్రమణకు గురవుతున్న కాల్వకట్టలు
- ధ్వంసమైన తూములు.. చోరీలకు గురైన ఆఫ్, ఆన్ షట్టర్లు
- మరమ్మతులు చేపట్టాలని రైతుల వేడుకోలు



కంపచెట్లతో మూసుకుపోయిన ఆర్11 మైనర్ కాలువ



చోరీలకు గురైన ఆన్, ఆఫ్ షట్టర్లు



ధ్వంసమైన ఆర్11 మైనర్ కాలువ తూము

పాలకవీడు : మండలంలో వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే ఎన్నెస్పీ కాల్వల నిర్వహణను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ప్రధాన, డిస్ట్రిబ్యూటరీలు అధ్వానంగా మారాయి. రైతులు పంటలు పండించాలంటే నీటి వనరులు ప్రధానం. అలాంటిది మండలంలో 90శాతం రైతులు సాగర్ ఆయకట్టుపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. కాని అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని నాగార్జునసాగర్ మేజర్, మైనర్ కాల్వలు కంపచెట్లతో మూసుకుపోయి, కోతకు, ఆక్రమణకు గురవుతున్నాయి. కాల్వలకు ఊడిపోయిన తులపులు, చాలా చోట్ల ఆన్, ఆఫ్ షట్టర్లు చోరీకి గురయ్యాయి. ఓ వైపు కృష్ణానదిలో వరద ప్రవాహం కొనసాగుతుండడంతో సాగునీరు అందుతుందని రైతుల్లో ఆశలు నెలకొన్నాయి. ఈలోగా కాల్వలు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

90శాతం సాగుకు ఎన్నెస్పీ కాల్వలే దిక్కు..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాలువకు అనుసంధానమైన జాన్‌పహాడ్ మేజర్ పరిధిలోని మైనర్, సబ్‌మైనర్, పంట కాల్వలు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. మండలంలో 90శాతం సాగుకు ఎన్నెస్పీ కాలువ నీరే ఆధారంగా వ్యవసాయ పనులు జరుగుతాయి. ఆర్9, ఆర్10, ఆర్11, ఆర్12, ఆర్13, ఆర్14, ఆర్15, కొంత భాగం ఎల్14 మైనరు కాల్వల ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఈ కాల్వల ద్వారా సుమారు 14వేల ఎకరాల్లో సాగర్ ఆయకట్టు స్థిరీకరించబడింది. అలాంటి కాల్వలు ప్రస్తుతం కంపచెట్లతో మూసుకుపోయి, కొన్ని చోట్ల కాల్వ కట్టలు కోతకు గురై బలహీనంగా ఉన్నాయి. ఆర్11 పరిధిలో ప్రధాన షట్టర్ తూము వద్ద కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. అలాగే డ్రాపులు ధ్వంసమయ్యాయి, పంట కాల్వ తూములు విరిగి దర్శనమిస్తున్నాయి. కాల్వలపై పర్యవేక్షణ లేకపోవడంతో కాల్వకు రెండు వైపులా ఉండాల్సిన బాటలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో రైతులు తమ పంట ఉత్పత్తులు రవాణా చేయాలన్నా యంత్రాలు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడంలేదు.

ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలి..

ప్రస్తుతం సాగర్ డ్యాంకు ఎగువ నుంచి వరద కొనసాగడంతో ఈ సీజన్ ఆయకట్టుకు సాగు నీరు అందే అవకాశం కనిపిస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు త్వరితగతిన కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కంపచెట్లను తొలగించడం, కోతకు గురైన చోట కట్టలు పటిష్టపరచడం, ప్రధాన తూముల వద్ద గేట్లు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పర్యవేక్షణ లేక ఇబ్బందులు



సాగర్ కాల్వలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కంపచెట్లు పెరిగి కాల్వలు మూసుకుపోయాయి. పంట కాల్వలకు తలుపు లేక నాట్లు, కోతల సమయంలో నీటి ప్రవాహాన్ని నియంత్రించడంలో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందే మరమ్మతులు చేపట్టాలి.

– వెంకట్‌రెడ్డి, రైతు, నాగిరెడ్డిగూడెం

త్వరలో మరమ్మతులు చేయిస్తాం

మరో రెండురోజుల్లో లష్కర్లను పురమాయించి కంపచెట్లను తొలగిస్తాం. అదే విధంగా కాల్వలకు ఇతర మరమ్మతులు చేయిస్తాం. చాలా చోట్ల ఆఫ్ ఆన్ షట్టర్లు చోరీలకు గురయ్యాయి. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశాం. కాల్వ నీరు వచ్చే సమయానికి షటర్లు బిగించి రైతులకు ఎలాంటి సమస్య లేకుండా సాగు నీరు అందిస్తాం.

– సతీష్, ఎన్నెస్పీ ఏఈఈ, పాలకవీడు

క్లుప్తంగా

నీటి విడుదలపై ప్రభుత్వం స్పందించాలి

చిలుకూరు : నీటి విడుదలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నందున సాగర్‌కు స్వల్పంగా నీటి ప్రవాహం ప్రారంభం కావడంతో ప్రభుత్వం నీటి విడుదలపై స్పందించి ప్రకటన చేస్తే ఆయకట్టులోని రైతులు వడ్లు చల్లుకొని ముందస్తుగా నారుమడులు సిద్ధం చేసుకుంటారని అన్నారు. సాగర్ నీటిపై షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం నీరు రాక, వర్షాలు సక్రమంగా కురవక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈ ఏడాదైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అవయవ దాతల సంఘం జిల్లా కన్వీనర్‌గా రామ్‌నరేష్



రామ్‌నరేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న సీతామాలక్ష్మి

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఉప్పల రామ్‌నరేష్ అవయవ దాతల సంఘం జిల్లా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అఖిల భారత అవయవదాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామాలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి తనను నియమించి నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీల బడ్జెట్‌పై హర్షం

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధికి మూడు వేల కోట్లపైగా నిధులు కేటాయించడం పట్ల కోదాడ నియోజకవర్గ ఏఐయూడబ్ల్యూసీ చైర్మన్ ఎస్‌కె.గులాం హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రెండు వేల కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూడు వేల కోట్లకు పైగా కేటాయించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

జీఓ 317ను రద్దు చేయాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం జీఓ 317ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు టి.నరేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోనిర్వహించిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల డీఏలు, పెండింగ్ బకాయిలను మంజూరు చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాలమ్మ మృతి బాధాకరం



సాలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గరిడేపల్లి : మండల పరిధిలోని మంగాపురం గ్రామపంచాయతీ స్వీపర్ కత్తి సాలమ్మ మృతి బాధాకరమని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం గ్రామంలో సాలమ్మ మృతదేహాన్ని ఆయన సందర్శించి సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం సాలమ్మ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. సాలమ్మ కుటుంబానికి సీఐటీయూ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకన్నమల్లీశ్వరి, సందీప్, పంచాయతీ కార్మికులు కొండ సైదులు, నర్సిరెడ్డి, మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని 14వ వార్డుకు చెందిన హరీష్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అవార్డు కమిటీ సభ్యులు, నాయకులు ఆదివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యోహాన్, రామకృష్ణ, సైదులు, అశోక్, అబ్రహం, బాబు, వీరబాబు, దేవమణి, విక్రమ్, రాజా, తిరుపయ్య తదితరులు పాల్గొన్నారు.

బైకుల్లో పెట్రోల్ చోరీ

చిలుకూరు: చిలుకూరులో పెట్రోల్ దొంగలు రెచ్చిపోతున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో ఇంటి బయట పార్క్ చేసిన 8 బైకుల్లో పెట్రోల్ చోరీ చేశారు. ఆదివారం బైక్ స్టార్ట్ చేసే సమయంలో తమ వాహనాల్లో పెట్రోల్ లేకపోవడంతో చోరీ జరిగినట్లుగా బాధితులు గుర్తించారు. ఈమేరకు చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

గరిడేపల్లి : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. నేడు (సోమవారం) కోదాడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశంలో అన్ని ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బెజ్జం రమేష్, ఎడవల్లి వెంకటేశ్వర్లు, షేక్ పెద్ద మస్తాన్, బజాజ్ అప్పాచారి, ఆనందరావు, నాగయ్య, రవి, చింతలపాటి శ్రీను, నెమలి వీరయ్య, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులను నింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిలుకూరు : సాగర్ నీటిని విడుదల చేసి మండలంలోని చెరువులు, కుంటలను నింపి ప్రజలను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొల్లు నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సరైన వర్షాలు లేక బావులు, బోర్లు, చెరువులు ఎండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే సాగర్ నీటిని విడుదల చేసి ముక్యాల బ్రాంచ్ కెనాల్ కింద రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డా గురవయ్య, నాయకులు సోమయ్య, సత్యనారాయణ, మస్తాన్, శ్రీమన్‌నారాయణ, ఆదినారాయణ, శ్రీనివాస్‌రావు ఉన్నారు.

అనగాష్టమి వ్రతంతో శుభాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

భానుపురి : అనగాష్టమి వ్రతంతో శుభాలు కలుగుతాయని శ్రీసాయి మందిరం అధ్యక్షుడు కర్నాటి రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయినగర్‌లో గల సాయిబాబా మందిరంలో అనగాష్టమి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనగాష్టమి వ్రతం ఆచరించడంతో తెలిసి తెలియక చేసిన పాపాలు తొలగిపోతాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మందిర కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, అర్చకులు వలివేటి విశ్వేశ్వర శర్మ, గంగాధర శర్మ, పద్మావతి, సోమ రాజ్యలక్ష్మి, బచ్చు నీరజ, పద్మ, భవాని పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలతో ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న నాగన్నగౌడ్

హుజూర్‌నగర్ : కేంద్రం తీసుకొచ్చిన అసంబద్ధ కార్మిక వ్యతిరేక చట్టాలతో పీఎఫ్ తీసుకునేందుకు కార్మికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో హమాలీ యూనియన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా తీసుకు రావడంతో కార్మికులు పీఎఫ్, ఇతర సౌకర్యాలు పొందలేకపోతున్నారని అన్నారు. యాజమాన్యాలు కార్మికుల పట్ల గుత్తాధిపత్యంగా వ్యవహరించడంతో పాటు వేతనాలు కూడా సరిగా చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి నేతృత్వంలో త్వరలో కేంద్ర కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించి దేశ వ్యాప్తంగా కార్యాచరణ చేపట్టబోతున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో యూనియన్ నాయకులు చింతకాయల రాము, కందుల వెంకన్న, గుంజ వెంకన్న పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం



మేళ్లచెరువు : సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మునగాల : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేస్తామని చెప్పి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కిందని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 31న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చి విద్యార్థులు, నిరుద్యోగులను ఆదుకోవాలని, లేకుంటే ఉద్యమాలకు సిద్ధమని హెచ్చరించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు బడ్జెట్‌లో కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కపిల్‌సిబాల్ నివేదిక ప్రకారం 30శాతం నిధులు కేటాయిస్తేనే విద్యారంగానికి న్యాయం జరుగుతుందని చెప్పినప్పటికీ కనీసం ప్రాధాన్యం ఇవ్వకుండా ఏడు శాతానికి దిగజారి బడ్జెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్నారు. విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించి, ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని అప్రమత్తం చేసి సరైన వైద్యం అందించాలని కోరారు. సమావేశంలో పీవైఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి, జిల్లా కోశాధికారి బండి రవి, జిల్లా నాయకులు పొన్నం బ్రహ్మం తదితరులు ఉన్నారు.

31న చలో అసెంబ్లీని విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : విద్యారంగ సమస్యలపై ఈనెల 31న నిర్వహించే చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు కామాల ఉదయ్ కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రామికభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి 7.3శాతం మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి విద్యార్థులకు, నిరుద్యోగులకు బడ్జెట్లో కనీస ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. కపిల్‌సిబాల్ నివేదిక ప్రకారం బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయిస్తేనే విద్యారంగానికి న్యాయం జరుగుతుందని చెప్పినప్పటికీ ప్రభుత్వం వినిపించుకోలేదని ఆయన తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 31న నిర్వహించే చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు భాను, ప్రవీణ్, మధు, గౌతమ్, ముఖేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

మేళ్లచెరువు : కార్మికుల సమస్యలపై ఈనెల 31న నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. అర్హులైన బిల్‌కలెక్టర్, కారోబార్‌లను పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు, యూనియన్ అధ్యక్షుడు వెంకన్న, మల్లిఖార్జున్, వెంకటి, వెంకటేశ్వర్లు, సైదులు, మోష, కిరణ్, ఉప్పలమ్మ, ఊర్మిళ పాల్గొన్నారు.

పోచమ్మ అమ్మవారికి సారె, ఒడిబియ్యం సమర్పణ



అమ్మవారికి సమర్పించేందుకు తీసుకువచ్చిన సారె, చీర, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీశైవక్ వనిత శక్తి కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని మహిళలు స్థానిక పోచమ్మ అమ్మవారికి సారె, ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా అత్యధిక సంఖ్యలో పట్టణ మహిళలు రకరకాల పిండి వంటలు చేసుకుని వచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె, ఒడి బియ్యం పోసి, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సకాలంలో వానలు కురిసి పాడి పంటలు పండి, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు టి.నాగలక్ష్మి, కార్యదర్శి టి.సుజాత, కోశాధికారి వి.పద్మ, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చైతన్య సదస్సు కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘం నాయకులు

గరిడేపల్లి : మంఠంపల్లి మండల కేంద్రంలో ఈనెల 30, 31తేదీల్లో నిర్వహించే జిల్లా గిరిజన సంఘం చైతన్య సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల పరిధిలోని మంగాపురంతండాలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ గిరిజన సంఘం అభివృద్ధికి భవిష్యత్ పోరాటాలకు ఈ జిల్లా సదస్సులో చర్చించించనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కె.యాకూబ్, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతి పూజా విధానంపై అవగాహన



అర్చకుడు లక్ష్మీనర్సింహస్వామిని సన్మానిస్తున్న మహిళలు

నేరేడుచర్ల : పట్టణంలోని శివాలయంలో శాస్త్రీయ పద్ధతిలో జరుపుకునే పూజా విధానంపై ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు నందుల లక్ష్మీనర్సింహశాస్త్రి గృహిణులు ఇంట్లో నిత్యం చేసుకునే పూజలో తప్పులు దొర్లకుండా వాటిని శాస్త్రీయ పద్ధతిలో జరుపుకునే విధానంపై ఐదు రోజుల పాటు సవివరంగా అవగాహన కల్పించారు. అనంతరం లక్ష్మీనర్సింహశాస్త్రిని బంటు శ్రీనివాస్, ఓరుగాల అనిత శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ సభ్యులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ



శాకాంబరి దేవిగా పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మఅమ్మవారు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవాలయంలో ఆదివారం ఆషాఢమాస బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారిని శాకాంబరి దేవీగా అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరణ చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. అదే విధంగా దాతలు కె.వీరయ్య రామనర్సమ్మ దంపతులు భక్తులకు మహాఅన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పూజారి కంటు వీరయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు పండుగ



గోరింటాకు పెట్టుకుని సందడి చేస్తున్న మహిళలు



వాసవీమాత పూజల్లో మహిళలు

హుజూర్‌నగర్ : ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు గోరింటాకు పండుగను స్థానిక వర్తక సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గోరింటాకు చేతులకు పెట్టుకుని సందడి చేశారు. అనంతరం వాసవీమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అందరూ పాటించాలన్నారు. మన సంప్రదాయాలలో ఎన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మహిళలు ఎస్.స్రవంతి, సీహెచ్.చిల్లంచర్ల గీత, వి.పద్మావతి, మాలతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పలకలు పంపిణీ



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు వల్లెపు శ్రీనివాస్ స్వచ్ఛందంగా 55మంది విద్యార్థులకు ఆదివారం నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో గుంజ పెదవెంకన్న, చిన వెంకన్న, పల్లపు తిరుమలేష్, గుంజ తిరుమలేష్, దేవరంగుల రాము, పల్లపు నాగరాజు, దేవరంగుల యల్లయ్య, గుంజ మురళి, రాజశేఖర్, శ్రీకాంత్, గంటెపంగు నాగరాజు, గంటెపంగు విజయ్, పందిటి నవీన్ కుమార్, సీమ మోష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డి సేవలు మరువలేనివి

భానుపురి : తెలుగు సాహిత్య రంగానికి సినారె అందించిన సేవలు మరువలేనివని సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ అన్నారు. కవి నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం సూర్యాపేటలో శ్రీ జ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో స్వరాభిషేకం పాటల విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, మీలా మహదేవ్‌లు కవి నారాయణ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక అధ్యక్ష కార్యదర్శులు బుర్రి వెంకటేశ్వర్లు, గుండా రమేష్, ఎస్పీ రోజా, అమీద్ ఖాన్, రాధాకృష్ణారెడ్డి, నాగవల్లి, తదితరులు పాల్గొన్నారు.